క్లుప్తంగా

నేడు చదలాడలో క్రిస్మస్ ఆరాధన

పెద్దాపురం: మండలంలోని చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో గురువారం క్రిస్మస్ ఆరాధన నిర్వహించనున్నట్టు సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ఒబిలిశెట్టి బాలయోగి రైస్‌మిల్లు ప్రాంగణంలో భారీ బహిరంగ క్రిస్మస్ ఆరాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

శ్రీరాంపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



శ్రీరాంపురంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురం గ్రామ సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఈటీపీఆర్డీ భాస్కరరావు ఆవిష్కరించారు. గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమాకూర్చిన కి ట్లను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో సచివాలయ కనీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముసలమ్మ, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో డీఐజీ



డీఐజీకి ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపురసుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ వర్గాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికాయి. ఉపాలయాల దర్శనానంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనం చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ లతా కుమారి, సీఐ డి.సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెప్మా బజార్



మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మెప్మా బజార్

సామర్లకోట: స్థానిక సంత మార్కెట్‌లో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన బజార్ ఆకట్టుకుంది. స్థానిక కోటమ్మ చెరువు వద్ద ప్రతి బుధవారం కూరగాయల సంత మార్కెట్ జరుగుతుంది. ఈ సంతలో వివిధ గ్రామాల ప్రజలు వచ్చి సరకులను కొనుగోలు చేస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రజలను ఆకర్షించేలా సభ్యులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులతో మెప్మా బజారు ఏర్పాటు చేశారు. మహిళలకు అవసరమైన చీరలు, దుప్పట్లు, పిల్లలకు గౌన్లు, డ్రస్ మెటీరియల్ తదితర వస్తువులను ప్రదర్శించారు. మెప్మా సీటీ మిషన్ మేనేజరు పెండ్యాల సుజాత, సీఓ పి ప్రసాద్, టీఎల్ఎఫ్ ఆర్పీ పి.మృదుల, పట్టణ సమాఖ్య రిసోర్స్ పర్సన్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

పెద్దాపురం: కనీస వేతనాలు అమలు చేయాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద స్థానిక ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ నాయకులు బేబీరాణి, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

పెద్దాపురం: సమస్యల పరిష్కారం కోరుతూ 26వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొననున్నట్టు మున్సిపల్ కార్మికులు బుధవారం కమిషనర్ జంపా సురేంద్రకు లేఖ అందజేశారు. సంఘం కార్యదర్శి శివకోటి అప్పారావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసు

సామర్లకోట: సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేయాలని నిర్ణయించినట్టు సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు అందుగుల వీర్రాజు, శ్రీనివాసరావులు తెలిపారు. 23 శాతం జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంఈఓ వై.శివరామకృష్ణయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రశాంతి, ఆర్.విజయకుమారి, కె.నాగమణి, కె.రామేశ్వరరావులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. అద్భుత విజయం

- సేంద్రియంతోనే ఆరోగ్యం
- మంచి దిగుబడులు సాధిస్తున్న రైతులు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- 598 ఎకరాల్లో ఈ విధానం అమలు



గోరింట గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న వరి పంట (ఫైల్)

పెద్దాపురం: మనం తీసుకున్న ఆహారమే మన ఆరోగ్యాన్ని.. ఆయుష్షును నిర్ణయిస్తుంది. తినే ఆహార పదార్థాలు రసాయనాలు, పురుగుల మందులతో నిండిపోతే అది మన శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. విచ్చలవిడి రసాయనాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు అంతా ఇంతా కాదు. పైగా పురుగు మందుల భారమే అన్నదాతను నిలువునా ముంచుతుంది. అందుకే ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడితో మండల రైతులు ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధిస్తున్నారు.

బ్రహ్మాస్త్రం తయారీ విధానం, లాభాలు

వేప, సీతాఫలం, గానుగ, ఉమ్మెత్త, ఆముదం ఆకులను 20 లీటర్ల ఆవు మూత్రంలో ఉడికించి చేసే కషాయాన్ని 'బ్రహ్మాస్త్రం' అని పిలుస్తారు. ఈ కషాయాన్ని పైరుపై పిచికారీ చేసే పెద్ద పురుగులు నశిస్తాయి.

నీమాస్త్రం

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల ఆవుపేడ, 10 కిలోల వేపాకులు కలిపి 48 గంటలు నానబెట్టాలి. ఇలా వచ్చిన నీమాత్రం మిశ్రమాన్ని మూడో రోజు వడబోసి పంటలపై పిచికారీ చేయాలి. దీంతో తెగుళ్ల, రసం పీల్చే పురుగులు నిర్మూలించవచ్చు. పది రోజులకొకసారి ఇలా పిచికారీ చేస్తే పైరు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

జీవామృతం తయారీ ఇలా..

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల ఆవుపేడ, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల పప్పు దినుసుల పిండి, పిడికెడు పుట్టమట్టి కలిపి 48 గంటలు పాటు నానబెట్టి తరువాత వడపోయాలి. ఇలా వచ్చిన జీవామృతాన్ని నీటి ద్వారా పైరుకు పారనివ్వాలి. తద్వారా భూసారం పెరుగుతుంది. ప్రకృతి సేద్యం ద్వారా కేవలం రూ.500 నుంచి రూ.700 లోపు పెట్టుబడితో ఎకరా వరి పొలంలో 25 నుంచి 30 బస్తాల దిగుబడులు సాధించవచ్చు.

అజొల్లా మదర్ పిట్

నీరు నిల్వ ఉండేలా చతురస్రాకారంలో గుంత తవ్వి పేడ, బెల్లం నీటితో కలిపి వారం రోజుల పాటు నిల్వ ఉంచాలి. దీంతో 'అజొల్లా' ఎరువు తయారవుతుంది. దీన్ని యూరియాకు ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. ఇది ప్రధానంగా కలుపు నివారణకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 8 కేజీల అజొల్లాను వేయవలసి ఉంటుంది. అలాగే చేపల పెంపకం, పాల శాతం పెంచేందుకు రోజుకు పది గ్రామాల వంతున పశువులకు మేతగా వేయవచ్చు.

ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువ

ప్రకృతి సేద్యంపై మొగ్గు చూపుతున్న రైతులు



జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

వ్యవసాయ రంగంలో పెను మార్పులు తీసుకువస్తున్నారు. సులభ పద్ధతిలో ఎరువులను తయారు చేసుకుని, ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అధిక దిగుబడితో పాటు మంచి లాభాలను గడిస్తున్నారు. రసాయన ఎరువులు పెరగడం, వాటి వల్ల లాభాలు లేకపోవడంతో ఈ విధానంపై చాలా మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన సేంద్రియ సాగు

మండలంలో గత ఏడాది రెండు, మూడు గ్రామాల్లోనే సేంద్రీయ సాగు జరిగింది. తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు రావడంతో రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి, చదలాడ గ్రామాల్లో సుమారు 598 ఎకరాల మేర సేంద్రీయ సాగు విస్తరించింది.

ఖర్చులు తగ్గాయి



సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ.10 వేలు పెట్టుబడితో రసాయన ఎరువులు వినియోగించి పంట సాగు చేసే పొలాన్ని ప్రకృతి సేద్యం ద్వారా రూ.వెయ్యితో పండించవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను వాడడం వల్ల ఆరోగ్యం కూడా బాగుంటుంది.

– కోన రామకోటేశ్వరరావు,రైతు, గోరింట, పెద్దాపురం మండలం

మొక్క పెరుగుదలకు మేలు



ప్రతి మొక్క పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే సూక్ష్మ పోషకాలు సంమృద్ధిగా అందుతాయి. నాణ్యమైన పంట అందుతుంది. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అందుకే రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి.

– సంజయ్‌కుమార్, మండల వ్యవసాయశాఖాధికారి, పెద్దాపురం

భక్తి శ్రద్ధలతో కాలభైరవాష్టమి పూజలు



పట్టు వస్త్రాలు, పూలు, గారెలతో స్వామిని అలంకరిస్తున్న అర్చకులు

సామర్లకోట: కాల భైరవ అష్టమి వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కాలభైరవస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మార్గశిర మాసంలో వచ్చే తొలి అష్టమిని కాలభైరవ అష్టమిగా నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయాన్ని పూలతో అలంకరించారు. భక్తులు తీసుకువచ్చిన గారెలు, పూల దండలతో స్వామివారిని అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, చందలాడ వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, భక్త సంఘం నాయకులు బిక్కిన పరమేశ్వరసాయి, బీవీ రమణ, చల్లా సత్తిబాబులు భక్తులకు సేవలందించారు. ఆలయ పండితులు వేమూరి సోమశ్వర శర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ పూజలు చేశారు.

న్యాయవాదుల ఆందోళన

పిఠాపురం: ఏపీ భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పిఠాపురంలో న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణంలో మోటారు సైకిల్ ర్యాలీ చేపట్టారు. సంఘ అధ్యక్షుడు మేరుగు రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దిగంబరా.. దిగంబరా.. శ్రీపాద వల్లభ దిగంబరా..!



మహా పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు



మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు




దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

- దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం
- మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో బుధవారం దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలం కావడంతో పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలతో ప్రారంభమైన దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు.. వారం రోజుల పాటు జరుగుతాయని ఆలయ ఈఓ ఆర్ సౌజన్య తెలిపారు. తొలి రోజు స్వామివారి పల్లకీ సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పల్లకీ సేవ పట్టణ పుర వీధుల్లో జరగడంతో పలువురు భక్తులు తిలకించి తరించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా ఉంది. మహోత్సవాల సందర్భంగా దేశ నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయుని ఆలయంలో బుధవారం దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు

అందరికీ మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: మెరుగైన వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆరోగ్యశ్రీ పథకంలో అందరికీ కార్పొరేట్ వైద్య సేవలు అందించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఎల్ఎన్ పురంలో బుధవారం ఆయన లబ్ధిదారులకు రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పరిమితిని పెంచిన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులేనన్నారు. కార్పొరేట్ స్థాయి చికిత్స అందించడంతో పాటు చికిత్స అనంతరం రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేల లబ్ధి చేకూరుతుందని వివరించారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి కార్డులు అందజేస్తారని, లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ యాప్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఎల్ఎన్ పురంలో 581 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచ్ పడాల ఏడుకొండలు, ఎంపీటీసీ బి.గంగా మహేశ్వరరావు, విరవ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ ఇందిర, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు, గండేపల్లి బాబీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అందుబాటులో విద్యార్థులు



జె.తిమ్మాపురంలో నమూనాను పరిశీలిస్తున్న డీన్, నరసింహరావు, రైతులు

వ్యవసాయ కళాశాల డీన్ శ్యామ్‌రాజ్ నాయక్

పెద్దాపురం: రైతులకు వ్యవసాయ సూచనలు ఇచ్చేందుకు తమ కళాశాల విద్యార్థులు అందుబాటులో ఉంటారని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్ రాజ్ నాయక్ అన్నారు. మండలంలోని గోరింట, జె.తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం కళాశాల విద్యార్థులచే వ్యవసాయ గ్రామ నమూనా పటాలను వివరించారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయక్ మాట్లాడుతూ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు నాలుగు నెలల పాటు రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తారన్నారు. అలాగే సాగుకు సంబంధించిన మెలకువలను రైతుల వద్ద నుంచి నేర్చుకుంటారని అన్నారు. నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తామన్నారు. తొలుత గ్రామ వ్యవసాయ భూములు, నీటి వనరులు లభ్యతతో కూడిన చిత్రపటాల నమూనాల ద్వారా రైతులకు వివరించారు.

ఈవీఎంలపై అపోహలు వద్దు



ప్రయాణికులకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

ప్రత్తిపాడు: ఓటింగ్ యంత్రాలపై అపోహలు వద్దని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ అన్నారు. ఓటింగ్ యంత్రాల వినియోగంపై ప్రత్తిపాడు మార్కెట్ సెంటర్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్‌ల పనితీరును, ఓటు హక్కును వీటి ద్వారా ఎలా వినియోగించుకోవాలో వివరించారు. మార్కెట్ సెంటర్‌లో పలువురు వర్తకులు, ప్రజలు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో ఈవీఎం ద్వారా ఓటు వేయించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కాసులమ్మ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు సిద్ధం

- ముస్తాబైన క్రైస్తవ ప్రార్థనా మందిరాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రార్థన మందిరం

కొత్తపల్లి: ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ ప్రార్థనా మందిరాలు సిద్ధమవుతున్నాయి. క్రైస్తవులు తమ గృహాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. క్రీస్తు దివి నుంచి భువికి ఉద్భవించినందుకు సూచనగా క్రైస్తవులు తమ గృహాలను, ప్రార్థనా మందిరాలను తీర్చిదిద్దుతున్నారు. నక్షత్రాల (స్టార్లు) అమ్మకాలు జోరందుకున్నాయి. పండగ సందర్భంగా కేకులకూ భారీగా డిమాండ్ పెరిగింది. ఈ నెల 25న క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కొత్తపల్లి, ఉప్పాడ, మూలపేట, పొన్నాడ తదితర గ్రామాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలంలో సుమారు 400 ప్రార్థనా మందిరాలున్నాయి. ఉప్పాడలో 120కి పైగా ప్రార్థనా మందిరాలు ఉండడం విశేషం. 24న రాత్రి క్రీస్తు పుట్టుకకు ఆనందంగా వీధుల్లో నినాదాలు చేస్తూ తిరుగుతారు. శుభాకాంక్షలు చెబుతూ క్రిస్మస్‌కు స్వాగతం తెలుపుతారు. ఆ రాత్రంతా ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఆనవాయితీ. క్రిస్మస్ సందర్భంగా స్టార్లు, కేకులు, దుస్తులు, పండ్ల దుకాణాలు క్రైస్తవ సోదరులతో కిటకిటలాడుతున్నాయి. చర్చిలకు రంగురంగుల విద్యుద్దీపాలతో, పెయింట్లతో సుందరంగా అలంకరించారు. కొన్ని ప్రార్థనా మందిరాల్లో ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలు జరుపుతారు. అన్ని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కొత్త సంవత్సరం మొదటి రోజు వరకూ క్రిస్మస్ వేడుకలను జరుపుతారు. బుధవారం నుంచి 24 వరకూ ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లి పరిసర గ్రామాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ కేరల్స్ సంప్రదాయంగా నిర్వహిస్తున్నారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి



మహాసభలో మాట్లాడుతున్న అర్జునరావు

ప్రత్తిపాడు: రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పిలుపునిచ్చారు. లంపకలోవ గ్రామంలో బుధవారం సాయంత్రం లిబరేషన్ లోకల్ మహాసభ జరిగింది. ఈ మహాసభకు సామిరెడ్డి నారాయణమూర్తి పరిశీలకునిగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలనే నినాదంతో గ్రామగ్రామాన ప్రచారం చేయాలని కోరారు. అవినీతి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని, అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాను కొండ లచ్చబాబు, అనుబంధ సంస్థల నాయకులు రాజాల రత్నం, బీరా దేవతయ్య, రాజమ్మ, మరియమ్మ, బండి ఏసుబాబు, పల్నాటి నూకరత్నం, బర్రె నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమ్మె

కాకినాడ సిటీ: సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను పటిష్ఠంగా అమలు చేయాలని కోరుతూ మెడికల్ రిప్రజెంటేటివ్‌లు బుధవారం ఒక రోజు దేశ వ్యాప్త సమ్మె నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడ పోస్టాఫీసు నుంచి బాలాజీ చెరువు మీదుగా జీజీహెచ్, జిల్లా పరిషత్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను పటిష్ఠంగా అమలు చేయాలని, మెడికల్ రిప్స్‌ను హైలీ స్కిల్డ్ ఎంప్లాయిస్‌గా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని వక్తలు పేర్కొన్నారు. మందుల రంగంలో ప్రభుత్వ కంపెనీలను బలోపేతం చేయాలని, ప్రైవేటు మందుల కంపెనీల ఆగడాలు అరికట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీని పని చేయించాలన్నారు. మెడికల్ రిప్‌లకు పని పద్ధతులు రూపొందించాలని, జియో ట్యాగింగ్ వంటి పద్ధతులు రద్దు చేయాలన్నారు. యూనియన్ నాయకులు సి.వెంకట్రావు, పలివెల వీరబాబు, ఎంఏ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ అదృశ్యం

తొండంగి: మండలంలోని పీఈ చిన్నాయపాలేనికి చెందిన గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ డి.వెంకట సతీష్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఏడాది క్రితం సతీష్‌కు వివాహం జరిగింది. ఈ నెల 15 నుంచి అతడు కనిపించడం లేదని తండ్రి పాపారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

మంత్రిని కలిసిన హేమంత్



మంత్రి రాజాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న హేమంత్

తుని: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన మడదా హేమంత్ బుధవారం మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. తుని మండలం ఎస్ అన్నవరం క్యాంపు కార్యాలయంలో హేమంత్ మంత్రి రాజాను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హేమంత్‌ను మంత్రి రాజా అభినందించి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న స్కార్పియో

తొండంగి: బెండపూడి శివారు జాతీయ రహదారిపై తమ్మయ్యపేట వద్ద బుధవారం రాత్రి స్కార్పియో వాహనం డివైడర్‌ను ఢీకొంది. హైదరాబాద్ నుంచి అరకు వెళ్తున్న ఈ వాహనం తమ్మయ్యపేట వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కింది. ఎవరికీ ఎటువంటి అపాయం జరగలేదు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గిరిజన తండాల్లో సెబ్ దాడులు



ఉలిగోగుల అటవీ ప్రాంతంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ సిబ్బంది

ప్రత్తిపాడు: ఉలిగోగులు, మెట్టుచింత గిరిజన తండాల్లో సారా స్థావరాలపై బుధవారం ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) బృందం పెద్దఎత్తున దాడులు నిర్వహించింది. స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ కథనం మేరకు, ప్రత్తిపాడు మండలం ఉలిగోగుల అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై ఈ దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను, మెట్టుచింత అటవీ ప్రాంతంలో 300 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. రెండు స్థావరాల్లో 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సంఘటన ప్రాంతాల నుంచి పరారైన పెంకి సుబ్రహ్మణ్యం, పిల్లి అబ్బాయి అనే బుజ్జియ్యపై కేసులు నమోదు చేశారు. ఆయా దాడుల్లో కాకినాడ జిల్లా ఇంటెలిజెన్స్ వింగ్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్, స్థానిక సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.